'గుర్ల ఘటన నన్ను ఎంతో కలచి వేసింది. జలాలు కలుషితం కావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఫలితమే ఇది. అలా గని వారిపై తప్పును నెట్టేసి బాధ్యతల నుంచి తప్పుకోం. సమస్యలను సవాళ్లుగా స్వీకరించి, పరిష్కరిస్తాం. రాష్ట్రంలో అనేక చోట్ల ఈ సమస్య ఉంది. ప్రజలందరికీ శుద్ధి చేసిన తాగునీరు అందిస్తాం'


రోగి పరిస్థితిపై ఆరా తీస్తున్న పవన్ కల్యాణ్

గుర్ల ఘటన కలచి వేసింది

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గుర్ల, గరివిడి, చీపురుపల్లి, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారంతో ఇబ్బంది పడుతున్న బాధితులు, సంబంధిత కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. సోమవారం విశాఖ నుంచి రోడ్డు మార్గంలో విజయనగరం మీదుగా గుర్లకు చేరుకున్న ఆయన ముందుగా సొలిపి సోమరాజుపేట(ఎస్ఎస్ఆర్.పేట) వద్ద చంపావతి నదిలో ఉన్న రక్షిత నీటి పథకాన్ని పరిశీలించారు. నీటి శుద్ధి, సరఫరా తీరును కలెక్టర్ అంబేడ్కర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ అధికారులు వివరించారు. అనంతరం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, సేవలపై వైద్యులను ఆరా తీశారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు.

కలుషిత నీరే కారణం..

ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. నీటి సరఫరాలో లోపాలు, అధ్వాన పారిశుద్ధ్యం గురించి వివరించారు. వాంతులు, విరేచనాలతో పది మంది చనిపోయారని చెప్పారు. అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చారని వాపోయారు. కలుషిత నీరు, అపరిశుభ్ర వాతావరణమే ప్రాణాలు తీస్తున్నాయని బోరుమన్నారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. విచారణకు సీనియర్ ఐఏఎస్ అధికారి విజయానంద్‌ను నియమించామని, నివేదిక వచ్చాక ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

గత తప్పిదాలతోనే..

గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా చంపావతి నీరు కలుషితమైందని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఆ పరిస్థితిని మార్చుతామని, ప్రతి ఇంటికీ శుద్ధజలాన్ని అందిస్తామని చెప్పారు. విజయనగరంలోని కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో బహిరంగ మల విసర్జన ఆపాలని పిలుపునిచ్చారు. గుర్లలో కలుషిత నీరు తాగి కొందరు చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తన వంతుగా ఆయా కుటుంబాలకు సాయం అందిస్తానని ప్రకటించారు.


కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తూ...


పెదపెంకిలో ప్రత్యేక చర్యలు


ఉపముఖ్యమంత్రితో చర్చిస్తున్న కలెక్టరు

పార్వతీపురం పట్టణం: బలిజిపేట మండలంలోని పెదపెంకిలో బోద వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. 2016-17లో బలిజిపేటలో పర్యటించిన సమయంలో ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని పవన్ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని కలెక్టరు వివరించారు. దోమల నివారణపై దృష్టిసారించామన్నారు.

పైడితల్లి తెప్పోత్సవానికి ప్రాథమిక పరిశీలన

నేటి కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి


అలంకరణలో వనంగుడి అమ్మవారు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి నెలలో జాల ఉత్సవాల్లో భాగంగా సిరిమానోత్సవం అనంతరం వచ్చే మంగళవారం నాడు తెప్పోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఏటా పెద్దచెరువు పశ్చిమ దిక్కున సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తోంది. నేడు అధికారికంగా జరిగే ఈ ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ముందస్తు పరిశీలన నిమిత్తం సోమవారం పెద్దచెరువులో తెప్పను తిప్పారు. దేవస్థానం సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాదరావు, మత్స్యశాఖ అధికారి వాండిని, ఒకటో పట్టణ ఎస్సై రామ్‌గణేష్, రామతీర్థం ఈవో వై.శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య అధికారి బాలకృష్ణతో కలిపి 45 మంది వరకు తెప్పను ఎక్కి.. పరిశీలించారు. నేడు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు మరో 15 మంది ఎక్కాలని మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తల్లి సేవలకు, పత్రికా విలేకర్లకు అదనంగా మరో మూడు పడవలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీ ప్రసాదరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వనంగుడిలో వేదసభ, అమ్మవారికి పంచామృతాభిషేకాల అనంతరం ఊరేగింపుగా గాడిఖానా సమీపంలోని ఒడ్డున 5 గంటల సమయంలో తెప్పలో తల్లి విహరిస్తారన్నారు.


పెద్దచెరువులో తెప్పను తిప్పుతున్న దేవస్థానం అధికారులు, సిబ్బంది



పూర్వం గిరిజనులు వాడిన వివిధ రకాల వస్తువులు, వేటాడే పరికరాలు


అడవుల్లో దొరికే మన్యం ఉత్పత్తులు

మురిపించేలా మ్యూజియం

ప్రాచీన కాలంలో గిరిజనుల అలవాట్లు.. వారి సంస్కృతి, సంప్రదాయాలు.. నైపుణ్యంతో కూడిన జానపద కళలు.. విభిన్న నృత్యరీతులు.. ప్రతిబింబించేలా అలరిస్తాయి.. ఆలోచింపజేస్తాయి. ఈ నేపథ్యంలో నాటి జీవన విధానాన్ని తెలియజేస్తూ ఐటీడీఏ కురుపాం మండలం చింతమానుగూడ ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గిరిజన కళాక్షేత్రం ఆకట్టుకుంటోంది. మినీ మ్యూజియంగా కొత్త అందాలను సంతరించుకున్న ఈ కేంద్రంలో గిరిజనుల జీవన శైలి ఉట్టిపడేలా కళాకృతులను ఏర్పాటు చేశారు. చిత్రాలు, వివిధ రకాల సాధనాలు, వేట పరికరాలు, పంట ఉత్పత్తులు, మూలికలు, ప్రతిమలను ప్రదర్శిస్తున్నారు. భావితరాలకు ఇదో అపురూప కానుకని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సందర్శించాలని కోరారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం


గిరిజనుల జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు




నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకిత

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. సోమవారం పార్వతీపురంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. స్తూపం వద్ద జరిగిన స్మృతి పరేడ్‌లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో అయిదుగురు పోలీసులు అమరత్వం పొందారని, విధుల్లో వారు చూపిన ధైర్య సాహసాలు, నిబద్ధ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఎం.గాంధీ, ఎస్.సూర్యనారాయణ, సీహెచ్.చిరంజీవులు, బి.శ్రీరాములుకు నివాళులర్పించి వందనం సమర్పించారు. అమరుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేశారు. ఏఎస్పీలు దిలీప్ కిరణ్, అంకిత సురాన, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ ప్రక్రియ ఆగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో రెండేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి రాష్ట్ర నిధులతో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. 25 శాతం దాటని పనులు నిలిపివేయాలంటూ పేర్కొంది. దీంతో ఆధునికీకరణపై నీలినీడలు కమ్ముకున్నాయి.

– న్యూస్‌టుడే, పాలకొండ

ఆధునికీకరణ ఆలస్యం.. అవస్థలే నిత్యం

- బకాయిలతో ఆగిన కాలువల పనులు
- నేటికీ శివారుకు చేరని తోటపల్లి నీరు


సాగునీరు పారని తోటపల్లి ఎడమ కాలువ

తెదేపా హయాంలో నిధులు..

గతంలో తెదేపా హయాంలో 2018లో ఆధునికీకరణకు రూ.197 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు ప్రారంభించిన తరువాత వైకాపా అధికారంలోకి వచ్చింది. తొలుత 25 శాతం దాటని వాటిని నిలిపి వేయాలని చెప్పడంతో 2019లోనే ఆపేశారు. 2020లో తిరిగి ప్రారంభించారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో రబీల్లో చేపట్టారు. గత రబీలో వదిలేశారు. గుత్తేదారులకు బిల్లులు పెండింగు ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.


పాడైన మినీ షట్టరు

23 శాతమే..

పాత ఆయకట్టు కింద కుడి(17.616 కి.మీ), ఎడమ కాలువ(37.53 కి.మీ)లు ఉన్నాయి. కుడి కాలువ పరిధిలో 9.372 కి.మీ మేర కాంక్రీటు లైనింగ్ జరిగింది. ఎడమ వైపు 17.532 కి.మీ మేర చేపట్టారు. రెండింట్లో కలిపి మరో 28 కి.మీలలో లైనింగ్ నిర్వహించాలి. ఇప్పటి వరకు రూ.41.21 కోట్ల నిధులు మాత్రమే వెచ్చించారు. ఆధునికీకరణ ప్రక్రియ 23 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు గుత్తేదారులకు రూ.18 కోట్లు అందాలి.

ముంచుకొస్తున్న గడువు..

వచ్చే ఏడాది మే నాటికి పనులు పూర్తిచేయాలి. అందులో భాగంగా వచ్చే డిసెంబరు నుంచి పనులు ప్రారంభం కావాలి. అయితే బకాయిల కారణంగా గుత్తేదారు ముందుకు రాని పరిస్థితి. మరోవైపు 25 శాతం లోపు మాత్రమే ఆధునికీకరణ జరగడం, తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

రైతుల్లో ఆందోళన

బ్రిటిష్ కాలం నాటి కాలువలు కావడంతో రూపు మారాయి. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు చేరడం లేదు. ఆయకట్టు పరిధిలో చాలావరకు వర్షాధారమైన పంటలే ఉన్నాయి. వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడం, మరోవైపు కాలువల ద్వారా నీరు అందకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామని, తదుపరి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని జలవనరులశాఖ డీఈ రంగనాయకులు తెలిపారు.

పరిష్కార వేదికకు పరుగులు

★ 146 అర్జీల అందజేత

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు పోటెత్తాయి. జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు 146 మంది నుంచి వినతులు స్వీకరించారు. వారికి న్యాయం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.


నమోదు కేంద్రం వద్ద రద్దీ

గూడు కల్పించండి..



తోపుడు రిక్షాపై ఉన్న ఈమె పేరు **బోనెల చిన్నమ్మి**. పార్వతీపురం మండలం చినబొండపల్లికి చెందిన ఈమెకు గతంలో రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో కుడికాలు మోకాలి వరకు తీసేశారు. ఎడమ కన్ను సైతం కోల్పోయారు. ఛార్జింగ్ వాహనం ఇవ్వాలని భర్త పోలయ్యతో వచ్చారు. 30 ఏళ్ల క్రితం అగ్ని ప్రమాద బాధితులకు ఇచ్చిన ఇల్లు పాడైందని, గత ప్రభుత్వంలో మంజూరవగా రద్దు చేశారని తెలిపారు. సొంత గూడు కల్పించాలని విన్నవించారు.

బ్యాటరీ వాహనం ఇప్పించరూ..



కాళ్లు, చేతులు పూర్తిగా పనిచేయని **శేషగిరి**ది బలిజిపేట మండలం అరసాడ. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో చెల్లి వద్ద ఉంటున్నారు. వేరొకరికి కొంతైనా భారం తగ్గించాలంటే బ్యాటరీ వాహనం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వంద శాతం వైకల్యం ఉన్న తనకు రూ.15 వేలు అందించాలని కోరారు. అనంతరం కొందరు ఎత్తుకొని వెళ్లి ఆటోలో కూర్చోబెట్టారు.

నడవలేడు.. కూర్చోలేడు



పూర్తిగా మంచానికే పరిమితమైనా ప్రభుత్వం అందించే రూ.15 వేల పింఛను తమ కుమారుడికి రావడం లేదని కె.మురళి, సౌందర్య తెలిపారు. వీరి 12 ఏళ్ల కుమారుడు **జ్ఞానేశ్వరరావు** పుట్టుకతోనే దివ్యాంగుడు. నడవ లేడని, కూర్చో లేడని, చివరికి అన్నం కూడా సొంతంగా తినలేని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం రూ.6 వేలు ఇస్తున్నారని, పింఛను పెంచాలని కోరుతూ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు.

అధికారులకు సెలవుల్లేవు

పార్వతీపురం, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జిల్లా, మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జేసీ శోభిక ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులెవరూ సెలవు పెట్టకూడదని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఏనుగులు తొక్కేశాయ్!



పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి పంచాయతీ పరిధిలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం రాత్రి జి.సురేష్, ఆదినారాయణకు చెందిన పొలాల్లోకి వెళ్లి పంటలు తొక్కేశాయి. ఉదయం పొలానికి వెళ్లిన రైతులు పాడైన పంట చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఏనుగులను దూరంగా తరలించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

జీపీఎస్‌ల పునఃప్రారంభానికి చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలో కొన్నేళ్లుగా వివిధ కారణాలతో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(జీపీఎస్)ల్లో కొన్నింటిని పునఃప్రారంభించేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. 'గిరి విద్యార్థులకు చదువు దూరం' శీర్షికన గతనెల 15న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ఐటీడీఏ, పీఎమ్మార్సీ అధికారులు స్పందించారు. ఇప్పటికే వివరాలు సేకరించి, మూడు రోజుల క్రితం గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పెట్టారు. ఈ ఐటీడీఏ పరిధిలో 255కు గానూ ఇప్పటివరకు 64 విద్యాలయాలు మూతబడ్డాయి. 32 చోట్ల తిరిగి తరగతులు నిర్వహించేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరినట్లు డిప్యూటీ డీఈవో పి.నారాయుడు తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న 191 పాఠశాలల్లో 152 మంది మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నారని, కొన్నిచోట్ల సీఆర్టీలు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పైనుంచి ఆదేశాలు వచ్చాక వెంటనే ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వసతిగృహాలకు గర్భిణులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. ఈ నెల 23 నుంచి ఉత్తరాంధ్రలో తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈమేరకు ఇప్పటికే యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేసి, **08963–293040** నంబరు అందుబాటులో ఉంచామన్నారు. గర్భిణులను వెంటనే వసతి గృహాలకు తరలించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. నదులు, వాగులు, వంకలవైపు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించారు.

రైతేరాజు 6లో

ఏడిపిస్తున్న ఏబీ రోడ్డు

ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లో ప్రయాణాలు కత్తిమీద సాములా తయారయ్యాయి. రహదారులు దారుణంగా మారడంతో లారీ చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


పెద్దదిమిలి వద్ద ఏర్పడిన భారీ గుంతలో చేరిన నీరు


బగ్గామత్రిపాడు సమీపంలోని వంతెనపై ఏర్పడిన గొయ్యి

భామిని మండలంలో 27 కిలోమీటర్ల పొడవున ఉన్న ఏబీ రహదారి ఎక్కడికక్కడ గుంతలతో దర్శనమిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాటిల్లో నీరు చేరింది. బగ్గామత్రిపాడు కాజ్‌వేపై ఏర్పడిన గోతిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ఇసుక లారీ కూరుకుపోయింది. దీంతో ఊక, గ్రానైట్, ఇసుక లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సోమవారం ఉదయం పొక్లెయిన్ సాయంతో వాహనాన్ని బయటకు తీయడంతో ట్రాఫిక్ అంతరాయం తొలగింది. రోజూ ఇదే పరిస్థితి ఉంటోందని చోదకులు వాపోతున్నారు. దీనిపై ర.భ శాఖ ఏఈ జగన్మోహనరాజు వద్ద ప్రస్తావించగా. త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, భామిని

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

పార్వతీపురం పట్టణం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. ఈమేరకు సోమవారం జిల్లా నోడల్ అధికారి, ఈఈ అప్పలనాయుడు సంబంధిత ప్రకటన జారీ చేశారు. 15 మండలాల్లో 213 నీటి వినియోగదారుల సంఘాలకు, 1,560 ప్రాదేశిక ప్రాంతాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 21 నుంచి 29 వరకు వివిధ దశల్లో నిర్వహించనున్నారు.

జిల్లాలో వివరాలిలా..

★ మొత్తం సాగునీటి సంఘాలు	213
★ తోటపల్లి జలాశయం కింద	22
★ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు	04
★ ప్రాజెక్టు కమిటీ	01
★ మధ్యతరహా సంఘాలు	25
★ ప్రాజెక్టు కమిటీలు	04
★ చిన్నతరహా సంఘాలు	166
★ ప్రాదేశిక ప్రాంతాలు	1,560

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం



నివాళులర్పిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ప్రజారక్షణ విధుల్లో ప్రాణాలు సైతం పణంగా పెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేసే కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తేనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఆయన ఘన నివాళులర్పించారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోలీసు కుటుంబాలతో మాటామంతీ

పోలీసు అమరవీరుల కుటుంబాలతో ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరేడ్ మైదానంలో స్మృతివనం వద్ద మమేకమయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పండ్లు, నగదును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఎప్పుడు.. ఏ అవసరమున్నా తనను సంప్రదించవచ్చునని ఎస్పీ భరోసా ఇచ్చారు. పరేడ్ మైదానం నుంచి మయూరి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కార్పస్ ఫండ్ చెక్కు అందజేత

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్పీ వలస పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.నారాయణరావు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్ష అదనపు కార్పస్ ఫండ్ చెక్కు ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు కార్యాలయంలో అందజేశారు.



అమరవీరుల త్యాగాలను నినదిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎస్పీ జిందాల్ తదితరులు

కాకర సాగు.. లాభాలు బాగు

రైతేరాజు



కాకర పంట

భామిని, రామభద్రపురం, న్యూస్‌టుడే: కూరగాయల పంటల్లో కాకర సాగుతో ఏడాది పొడవునా లాభాలు పొందుతున్నారు భామిని, రామభద్రపురానికి చెందిన రైతులు.. రామభద్రపురంలోని 150 ఎకరాల్లో 300 మంది కాకర వేశారు. ఈ ఏడాది మార్కెట్లో ధర బాగుందని, దిగుబడులు ఎక్కువగా వచ్చాయని చెబుతున్నారు. రామభద్రపురం మార్కెట్లో 16 కిలోల కేటు గతంలో రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.350 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నట్లు తెలిపారు.

ఇదీ సాగు విధానం..

పంట సాగుచేసే ముందు 2, 3 దుక్కులు వేయాలి. ఎకరాకు 8 టన్నుల పశువుల వ్యర్థాలు చల్లాలి. 32 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్, నాటిన 30 రోజులకు, పూత పిందె దశలోనూ వేయాలి. నీరు మళ్లేలా కాలువలు తవ్వి, నెలకు 4, 5 సార్లు నీరు పెట్టాలి. మొక్కల మధ్య మీటరు దూరంలో పందిరి వేయాలి.

తెగుళ్ల నివారణ తప్పనిసరి..

కాకరను ఎక్కువగా ఆకుముడత, రసం పీల్చే తెగుళ్లు ఆశిస్తాయి. ఆకుముడత నివారణకు కోల్‌పాస్ 2, శాఫ్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగు ఆశిస్తే లీటరు నీటికి థయోమీథాక్సిన్ 0.3 మి.లీ, అంత్రాకాల్ 2 గ్రాములను కలిపి పిచికారీ చేయాలి. పసుపు ఆకు నివారణకు 19-19-19 మందు, ఆగ్రోమిన్‌మాక్స్ 5 గ్రాముల చొప్పున నీటిలో కలిపి చల్లాలని ఉద్యాన అధికారులు పి.జయశ్రీ, మోహన్‌కృష్ణ తెలిపారు.



సాగు ఆదుకుంది..: సోంపురానికి చెందిన రాజాన ఈశ్వరరావు అరెకరం భూమిలో కాకర సాగు చేస్తున్నారు. విత్తనాలు, కంపలు, ఎరువులు, పురుగు మందుకు రూ.15 వేలు మదుపు పెట్టగా రూ.50 వేలు ఆదాయం సంపాదించారు. మార్కెట్లో కేట్ కాయలు రూ.400 పలకడంతో లాభాలు ఆర్జించారు.



రెండు నెలల్లో లాభం.. భామిని మండలం సతివాడకు చెందిన బల్లు జనార్దనరావు. 30 సెంట్లలో పంట వేశారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, కలుపు నివారణకు రూ.15 వేలు ఖర్చు చేశారు. రెండు నెలల్లో 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కిలో రూ.30 చొప్పున రూ.54 వేలుకు అమ్మారు. పెట్టుబడి పోనూ రూ.39 వేలు లాభం వచ్చినట్లు జనార్దనరావు తెలిపారు.

వేరుసెనగలో లద్దె పురుగుతో జాగ్రత్త

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేరుసెనగ విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎక్కువగా వ్యాపించే పొగాకు లద్దెపురుగు నివారణకు కురుపాం ఉద్యాన అధికారిణి సి.హెచ్.గిరిజ పలు సూచనలు చేశారు.



లద్దె పురుగు సోకిన వేరుసెనగ

★ గుడ్ల సముదాయం, పిల్ల పురుగులను నాశనం చేయాలి.

★ లింగాకర్షక బుట్టలు పెట్టి తల్లి పురుగు వృద్ధిని గమనించాలి. ట్రైకోడెర్మా గుడ్ల పరాన్నజీవిని ఎకరాకు 50 వేల వరకు 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు వదలాలి.

★ గుడ్లు తొలిదశలో పిల్ల పురుగు నివారణకు వేపగింజల కషాయం లేదా నూనె పిచికారీ చేసుకోవాలి.

★ లార్వా కనిపిస్తే నోవాల్యూరాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండిమైడ్ 0.2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

బొప్పాయి సాగులో మెలకువలు..!

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: బొప్పాయి తోటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడులు వస్తాయని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తెలిపారు. ◆ నీరు నిలవని నల్లగరప, ఎర్ర నేలలు అనుకూలం. ◆ నేల ఉదజని సూచిక 6.5 నుంచి 8.5 వరకు ఉండాలి. ◆ కాండం కుళ్లు ఆశిస్తే లీటరు నీటికి 3 గ్రా. బ్లైటాక్స్ లేదా ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని కలిపి మొదళ్లలో వేయాలి ◆ ఆకుమచ్చ తెగులు ఆశిస్తే డైథేన్ ఎం-45 లీటరు నీటికి 2.5 గ్రా. చొప్పున కలిపి ఆకులపై పిచికారీ చేయాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్ పంటల్లో కోత, నూర్పిడిలో పాటించాల్సిన పద్ధతులు, రబీ సీజన్‌లో ఆరుతడి పంటల్లో విత్తన ఎంపిక, విత్తనశుద్ధిలో సలహాలకు 94410 13693 నంబరుకు సంప్రదించాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు.

ఎరువుల యాజమాన్యంతో పంటలకు మేలు



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులు సరైన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని, మోతాదుకు మించితే అనర్థమని విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త **తేజేశ్వరరావు** సూచించారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

? మిరపలో ఎరువుల యాజమాన్యం గురించి చెప్పండి? **- జి.తిరుమలరావు, రావివలస, గరుగుబిల్లి మండలం**

☛ ఎకరాకు 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాష్ వేయాలి. ఆఖరి దుక్కిలో లేదా నాటు వేసే సమయంలో భాస్వరం మొత్తం ఒకేసారి వేయాలి. నత్రజని, పొటాష్‌ను తక్కువ మోతాదులో నాటిన లేదా విత్తిన 30, 60, 90, 120 రోజులకు నాలుగు సార్లు వేయాలి.

? వరిలో దోమ నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- ఎ.రాంబాబు, బుడతనాపల్లె, గంట్యాడ మండలం**

☛ దోమ ఆశించిన వెంటనే లీటరు నీటిలో పైమెట్రోజైమ్ 0.6గ్రా. లేదా డైనోటెఫ్యురాన్ 0.4గ్రా. లేదా ట్రైఫ్లుమెజోపైరం 0.48 మి.లీ. చొప్పున కలిపి మందులు మారుస్తూ పిచికారీ చేయాలి. చేనును అడపా దడపా ఆరబెడితే దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పురుగు మందు మొక్కల మొదళ్లకు బాగా తగిలేలా పిచికారీ చేస్తే దోమను సులభంగా నివారించవచ్చు.

‘రైతు నేస్తం’ పురస్కారం



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న గౌరీశ్వరరావు

రాజాం, న్యూస్‌టుడే: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రకృతి సేద్యం రైతు పెంకి గౌరీశ్వరరావు సోమవారం ‘రైతు నేస్తం’ పురస్కారం అందుకున్నారు. ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివారం ఈ పురస్కారం అందుకున్నట్లు ఆయన ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. గౌరీశ్వరరావు పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ.. తోటి రైతులకు శిక్షణ ఇస్తున్నారు. స్వీయ సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. జీడి, మామిడితోపాటు వరి, అపరాలను ఈ పద్ధతిలోనే సాగు చేస్తూ వస్తున్నారు.

24న మెగా ఉద్యోగమేళా

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24న మెగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి పీజీ పూర్తి చేసిన 35ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ వివరాలు skilluniverese.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79956 91295 నంబరును సంప్రదించాలన్నారు.

గాలులు పడేశాయి!

సాలూరు మండలంలో ఆదివారం రాత్రి భారీ గాలులతో వర్షం కురిసింది. దీంతో కూర్మరాజుపేట, చింతలవలస, కొదమ గ్రామాల్లో పలువురు రైతులకు చెందిన వరి చేలు, కంద మొక్కలు నేలకొరిగాయి. మరో నెల రోజుల్లో చేతికి రావాల్సిన వరి చేలు పాడవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొదమలో 4 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ఏవో అనూరాధ తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



10 రోజులు.. ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

గుర్ల ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గుర్ల ఘటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవోలతో సోమవారం సాయంత్రం దూరదృశ్య సమావేశం నిర్వహించారు. రోజూ తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని, దీన్ని అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు త్వరలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. తుపాను ప్రభావంతో బుధ, గురువారాల్లో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశమున్నందున అధికారులంతా 22 నుంచి 26 వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముందస్తు చర్యలపై మంగళవారం సాయంత్రానికి ప్రణాళిక అందజేయాలన్నారు. డీఆర్వో ఎస్.డి.అనిత పాల్గొన్నారు.

కబడ్డీలో ప్రథమంగా నిలపడమే ధ్యేయం

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని కబడ్డీలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సంఘం కార్యదర్శి వై.శ్రీకాంత్ అన్నారు. జిల్లా కబడ్డీ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అసోసియేషన్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను దేశానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా నూతన కమిటీ ఛైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కేవీ ప్రభావతితో పాటు 16 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు విశ్రాంత న్యాయమూర్తి సుబ్బరాజు ప్రకటించారు. పరిశీలకులుగా వర్కింగ్ అధ్యక్షుడు అర్జునరావు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

నేడు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

పార్వతీపురం పట్టణం: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం వెంకంపేట సమీపంలో నిర్వహిస్తామని సంఘ జిల్లా కార్యదర్శి ఎం.మురళీకృష్ణ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, డీటీ గాంధీ, వైకుంఠరావు పాల్గొన్నారు.

నగరంలో చీకటి రహదారులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

విజయనగరంలో చీకటి పడితే పలు దారుల్లో అంధకారం అలుముకుంటోంది. తెదేపా హయాంలో పురపాలక సంఘంగా ఉన్నప్పుడు ఈఈఎస్ఎల్ కంపెనీ ద్వారా ఎల్ఈడీ దీపాల నిర్వహణ జరిగేది. అప్పట్లో వీధిదీపాల సమస్య లేకుండా ఉండేది. గతేడాది మార్చి నుంచి ఈ సంస్థతో ఒప్పంద గడువు పూర్తయింది. మూడు నెలలు పొడిగించినా మధ్యలోనే వైదొలగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో దీన్ని పొడిగించకపోవడంతో వీధి దీపాల సమస్య మొదటికి వచ్చింది.

నెలాఖరుతో గడువు పూర్తి..

ఈఈఎస్ఎల్ కంపెనీ వైదొలగిన తర్వాత కొన్ని నెలలు నగర పాలక సంస్థ నిర్వహించింది. గతేడాది నవంబరులో శ్రీసిరి కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు బాధ్యత అప్పగించింది. ఏడాది కాలానికి రూ.1.59 కోట్లతో టెండరు దక్కించుకుంది. ఈఈఎస్ఎల్ ఉన్నప్పుడు మాదిరిగా వీధి దీపాల నిర్వహణ లేదనే విమర్శలున్నాయి. ఈఈఎస్ఎల్ ఉన్నప్పుడు బల్బు పోతే కొత్తది వేసేవారు. కొత్త ఏజెన్సీ ఏ భాగం పోతే దాన్ని మారుస్తుండటం వల్ల వెలుతురు తగ్గుతోందనే విమర్శలున్నాయి. ఉదాహరణకు దీపానికి బోర్డు, డ్రైవర్ ఉంటాయి. వీటిలో ఏది పోతే దాన్ని మార్చి దీపం వెలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఒక బల్బు వెలిగించినందుకు రూ.53 నగర పాలక సంస్థ చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు.



ఒరుగంటివారి తోట దారిలో కారు చీకట్లు

మొత్తం దీపాలు 20,050

ఇక్కడ అన్ని రకాల దీపాలు 20,050 ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటిలో ఈఈఎస్ఎల్ ద్వారా వేసినవి 18,474 ఉన్నాయి. తదుపరి నగర పాలక సంస్థ మరికొన్నింటిని కొనుగోలు చేసి వేసినట్లు చెబుతున్నారు. ఇక్కడ డివిజన్‌కు 10 చొప్పున 50 డివిజన్లలో 500 వరకు వీధి దీపాలు వేయాలని గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ★ ప్రస్తుతం నగరంలో సుమారు 1500 వరకు వివిధ కారణాలతో వెలగని దీపాలు ఉన్నట్లు చెబుతున్నారు. లక్ష్మీగణపతి కాలనీ, ఫూల్‌బాగ్ ప్రాంతం, అయ్యన్నపేట, కోర్టు దారి నుంచి ప్రదీప్‌నగర్ మీదుగా ధర్మపురి వరకు, పద్మావతినగర్ నుంచి ధర్మపురి దారిలో, కేఎల్‌పురం రెవెన్యూ కాలనీ, కలెక్టరేట్ దారిలోని ఏసీబీ కార్యాలయ రోడ్డు తదితర చోట్ల కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. చీకటి పడితే ఎల్‌బీ కాలనీ దారిలో పలు చోట్ల మసకగా రహదారులు ఉన్నాయి. కంటోన్మెంట్ ఉడా కాలనీ దారిలో దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. కుక్కల సంచారం పెరగడంతో రాత్రులు వీధి దీపాలు వెలగని చోట్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మళ్లీ ఈఈఎస్ఎల్ నిర్వహణలోనికి తీసుకురావాలని కోరుతున్నారు. దీపాలు సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

వీధి దీపాల నిర్వహణపై విమర్శలు

ఆకలితో అలమటిస్తున్నాం.. ఆలోచించండి

కొమరాడ, న్యూస్‌టుడే: పార్వతీపురం నుంచి కూనేరు వరకు ప్రయాణం నరకంగా మారిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి అన్నారు. నాలుగు రోజులుగా ఎక్కడికక్కడ గుంతల్లో లారీలు కూరుకుపోవడంతో కొమరాడలో సోమవారం నిరసన తెలిపారు. గంటల తరబడి ఇక్కడే ఉండిపోతూ ఆకలితో అలమటిస్తున్నామని ఖాళీ కంచాలు చూపుతూ ఆందోళన చేపట్టారు. వాహనాలు సైతం దెబ్బ తింటున్నాయన్నారు. భారీ వాహనాలను సాలూరు మీదుగా తరలించేలా ఆర్టీవో, పోలీసు, ర.భ.శాఖ అధికారులు ఆలోచించి చర్యలు తీసుకోవాలన్నారు.



కంచాలతో నిరసన తెలుపుతున్న లారీ చోదకులు, సీపీఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సీతారాం

మెంటాడ, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మెంటాడ మండలంలో చోటుచేసుకుంది. ఆంధ్ర ఎస్ఐ సీతారాం వివరాల ప్రకారం.. గజపతినగరం మండలం కొనిశకు చెందిన పి.అప్పలనర్సింహరాజు(57) ద్విచక్ర వాహనంపై మెంటాడ మీదుగా వెళ్తున్నారు. హరిత రహదారి పనులకు ముగ్గురు వ్యక్తులతో వస్తున్న మరో ద్విచక్ర వాహనం గద్దె చిన్నచెట్టుకు సమీపంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు క్షతగాత్రుడిని మెంటాడ పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అప్పలనర్సింహరాజుకు వృద్ధురాలైన తల్లి ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని రాణిమల్లమ్మదేవి చెరువు గట్టుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ సతీష్‌కుమార్ వివరాల మేరకు.. సోమవారం ఉదయం గట్టుపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆయన వద్ద మందులు, చీటీలు ఉన్నాయి. అందులో కె.గౌరీశంకర్‌గా రాసి ఉంది. స్థానిక ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్‌లోనూ ఆపేరు నమోదై ఉంది. ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాక ఇక్కడ సొమ్మసిల్లి పడిపోయారా? గుండెపోటుతో చనిపోయారా? అన్నది తెలియాల్సి ఉందని సీఐ అన్నారు. సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. వివరాలు తెలిస్తే 9121109422కు ఫోన్ చేయాలని కోరారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కోట, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో మెషినిస్ట్ అప్రెంటీస్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులు 31లోగా www.apprentieship.gov.inలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం నవంబరు 7న ఉదయం 10 గంటలకు వి.టి.అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ కళాశాలకు హాజరుకావాలని కోరారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు మరో కౌన్సెలింగ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి అయిదో విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా కన్వీనర్ టి.వి.గిరి ఓ ప్రకటనలో తెలిపారు. 28న ప్రభుత్వ ఐటీఐ, 30న ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, 26న యూనిక్ నంబరుతో ఐటీఐలో ధ్రువపత్రాలు పరిశీలన చేసుకోవాలని కోరారు.

గడువు పెంపు

పార్వతీపురం పట్టణం: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించిన దరఖాస్తుల గడువు ఈ నెల 25 వరకు పెంచినట్లు డీడీ గయాజుద్దీన్ తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు, శిక్షణ ఇచ్చే సంస్థలు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696
(10 AM TO 1 PM)

? బిబిరి ఏపీ రహదారి నుంచి మూలగూడకు ఉన్న మార్గంలో రాళ్లు తేలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - గ్రామస్థులు
★ అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. అనుమతులు వస్తే పనులు చేస్తాం. - సత్యనారాయణ, ఏఈ, ఐటీడీఏ
- న్యూస్‌టుడే, సీతంపేట



? పాలకొండ ఆర్టీసీ బస్సు నిలయంలో 8 కుర్చీలు విరిగిపోయాయి. ప్రయాణికులు నిల్చొని ఉండాల్సి వస్తోంది. - కిరణ్
★ పరిశీలించి బాగు చేస్తాం. అవసరమైతే కొత్తవి తీసుకొస్తాం. -పి.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజరు
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? వీరఘట్టం మండలం కంబరలో వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతుంది. - స్థానికులు
★ పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతాం. - జి.వెంకటరమణ, ఎంపీడీవో
- న్యూస్‌టుడే, వీరఘట్టం

? అప్పయ్యపేట ఎస్సీ కాలనీ నుంచి సువర్ణముఖి నదికి వెళ్లే మార్గం పనికిరాని మొక్కలతో నిండిపోయింది. - వెంకటరమణ
★ పనికి రాని మొక్కలు తొలగిస్తాం. - రమేష్, ఈవో, పెదబొగిలి
- న్యూస్‌టుడే, సీతానగరం

? జియ్యమ్మవలస మండల కార్యాలయం చుట్టూ పనికిరాని మొక్కలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. - స్థానికులు
★ మొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేస్తాం. - ఎస్.రమేష్, ఎంపీడీవో
- న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

వ్యాసరచనలో ప్రతిభ





పార్వతీపురం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల వారికి వ్యాసరచన పోటీలు జరిగాయి. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని పోటీ పడ్డారు. తొమ్మిదో తరగతికి చెందిన ఎం.పి.సంజశ్రీ, కె.లాస్య, జి.ఉషశ్రీ ప్రతిభ చూపి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ బి.జగదీష్, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం

గ్రామాలాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గెడ్డలుప్పిలో రూ.2.5 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గెడ్డలుప్పి కూడలి నుంచి కొత్తవలస వరకు రహదారి అధ్వానంగా ఉండటంతో సువర్ణముఖి నదిని దాటించడం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. పలువురు నాయకులు, అధికారులు ఉన్నారు. ● పార్వతీపురం పురపాలక: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కార్మికులకు ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. పుర కార్యాలయం వద్ద కార్మికులతో మాట్లాడారు. ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజల మన్ననలు పొందేలా పనులు చేయాలన్నారు.


గెడ్డలుప్పిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పనుల్లో జాప్యం.. అభివృద్ధికి దూరం

కురుపాంలో సమస్యల తాండవం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండల కేంద్రం సమస్యల నిలయంగా మారింది. రహదారి విస్తరణ పనులు మొదలు పాఠశాలలు, ఆసుపత్రి, ప్రభుత్వ భవనాలు ఇలా అన్ని పనులు ఆగిపోవడంతో అభివృద్ధి అంతంతమాత్రంగా ఉంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సేవలు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని ఆసుపత్రి

రూ.39 కోట్లతో ప్రారంభించినా..

తోటపల్లి నుంచి గుణుపూర్ వరకు రహదారి విస్తరణ పనులు రూ.39 కోట్ల అంచనాతో మూడేళ్ల క్రితం ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి కాలేదు. కురుపాంలో ఆగిపోవడంతో రహదారి అధ్వానంగా మారింది. ఇరువైపులా కాలువల నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థానికులు రోడ్డుపైకి వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. ఒడిశా, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, విశాఖకు నిరంతరం వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతోంది. కురుపాం బస్టాండ్‌లో కొన్ని ఇళ్లు తొలగించాల్సి ఉండటంతో పనులు ఆలస్యమైనట్లు ర.భ.శాఖ అధికారులు చెబుతున్నారు.

శిథిలమైన నీటి ట్యాంకు..

కురుపాంలోని ప్రధాన రక్షిత తాగునీటి పథకం నుంచి పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో దూర ప్రాంతాల్లోని ప్రజలు బావుల నుంచి నీరు తెస్తున్నారు. కొందరు శుద్ధ జలప్లాంట్ల వద్దకు వెళ్తున్నారు. ట్యాంకు శిథిలావస్థకు చేరింది, కనీసం శుభ్రం కూడా చేయడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. కొత్త ట్యాంకు నిర్మాణానికి రూ.1.80 కోట్లు వచ్చాయని, టెండర్లు పిలుస్తామని ర.భ.శాఖ జేఈ వేణు తెలిపారు.


పూర్తికాని జడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం


విస్తరణ పనులు ఆగిపోవడంతో అధ్వానంగా రహదారి

ఆసుపత్రి సేవల్లోనూ అవస్థలే..

కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు 2016-17లో సుమారు రూ.50.09 లక్షలు కేటాయించారు. అదనపు తరగతి గదులు, ప్రయోగశాల, గ్రంథాలయం పనులు ప్రారంభించారు. దీంతో సరిపడా గదులు లేక 428 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని హెచ్‌ఎం టి.శంకరరావు తెలిపారు. ❖ స్థానిక సీహెచ్‌సీని 50 పడకల స్థాయికి పెంచి గత ప్రభుత్వం పనులు ప్రారంభించింది. కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఆసుపత్రిలో సరిపడా పడకలు లేక రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఆసుపత్రికి వచ్చిన పడకలు, పరికరాలు వృథాగా మారాయి. భవన నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి తీసుకురాలేదు. ఆసుపత్రిలోని ట్యాంకు నుంచి తాగునీరు సక్రమంగా రాకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు.

డిమాండు



జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, విద్యాహక్కు చట్టం అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాస్పర్ బాబు డిమాండు చేశారు. సోమవారం పార్వతీపురంలో సంఘం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. జిల్లాలో పేద విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘ నాయకులు నాగభూషణం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

ఆవేదన



పార్వతీపురం మండలంలో ఏళ్ల నుంచి సాగుచేస్తున్న రైతులకు పోడు పట్టాలు అందించాలని సీపీఎం జిల్లా కోశాధికారి జీవీ రమణ డిమాండు చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేశారు. వెంగళరాయ, సీతంపేట, పనసభద్ర, లచ్చన్నగోరవలస, గంగాపురం, ములగ, సంగంవలస రైతులు బైఠాయించారు. పంపిణీ చేయకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. తహసీల్దారు జయలక్ష్మికి వినతిపత్రం అందించారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

వరండాలోనే తరగతులు



బలిజిపేట మండలంలోని వంతరాం జడ్పీ ఉన్నత పాఠశాలలో గదులు సరిపోక వరండాల్లోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. స్థానిక ప్రాథమిక పాఠశాల 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలకు తీసుకురావడంతో సమస్య ఏర్పడింది. మొత్తం 218 మంది చదువుతుండగా సరిపడా గదులు మాత్రం లేవు. అదనపు నిర్మాణాల కోసం రూ.37 లక్షలు మంజూరైనా రూ.10.5 లక్షలు మాత్రమే విడుదల కావడంతో పనులు ఆగిపోయాయి. దీనిపై ఎంఈవో సింహాచలం వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

రోగులకు లిఫ్ట్ ఇవ్వరూ!

పాలకొండ ప్రాంతీయాసుపత్రిలో పై అంతస్తులకు వెళ్లేందుకు లిఫ్ట్ సదుపాయం లేదు. గతంలో ఆధునికీకరణ పనుల్లో భాగంగా నిర్మాణం చేపట్టినా యంత్రం ఏర్పాటు చేయలేదు. రోజూ ఆసుపత్రికి 500 మంది ఓపీకి వస్తారు. వీరిలో 60 నుంచి 90 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైనవారు పైఅంతస్తులోని వార్డులకు వెళ్లాలంటే మెట్లమార్గమే దిక్కు. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆసుపత్రి పర్యవేక్షకుడు నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా.. లిఫ్ట్ ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ



కర్రే.. ప్రమాద సూచిక



వీరఘట్టం మండలం నడిమికెల్ల వద్ద సీఎస్పీ రహదారిపై గుంత పడింది. ఇటీవల వర్షాలతో నీరు చేరడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. శ్రీకాకుళం, భామిని, సీతంపేట, పాలకొండ, పార్వతీపురం, రాయగడకు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ నేపథ్యంలో స్థానికులు స్పందించి ఎరుపు రంగు వస్త్రాన్ని కర్రకు కట్టి సూచికగా ఏర్పాటు చేశారు. ర.భ.శాఖ జేఈ నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం

భోజన వేళల్లో మూసేస్తారా..!

సాలూరు పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న మూడోనెంబరు సచివాలయం మధ్యాహ్న సమయంలో మూతపడుతోంది. భోజన విరామం తీసుకోవడానికి సిబ్బంది భవనానికి తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఆ సమయంలో సేవల కోసం వచ్చిన ఆరు, ఏడు వార్డులోల నివాసముంటున్న ప్రజలు అసహనంతో వెనక్కి వెళ్లిపోతున్నారు. ఇదేమైన ప్రైవేటు దుకాణమా.. ప్రభుత్వ సేవా కేంద్రమా.. అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై పురపాలిక కమిషనర్ వద్ద ప్రస్తావించగా.. సిబ్బంది పనితీరుపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం


మధ్యాహ్నం సమయంలో మూతపడిన సచివాలయం

ఆందోళన



గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు 'చలో సీతంపేట ఐటీడీఏ' కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఐటీడీఏ కార్యాలయం ముందు బైఠాయించారు. గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మించాలని, ఇంటింటికీ కుళాయిలు వేయాలని కోరారు. గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ, జీవో 3 పునరుద్ధరణపై నినాదాలు చేశారు. డీడీ ఎం.అన్నాదొర, పీహెచ్‌వో ఎస్.వి.గణేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. – న్యూస్‌టుడే, సీతంపేట

ఆగ్రహం



బడిదేవర కొండపై అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్వతీపురంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2016లో ఈ ప్రాంతం షెడ్యూల్డ్‌గా ఉండటంతో తవ్వకాలకు అనుమతులు రాలేదన్నారు. ఇప్పుడే అదే కొండ రెవెన్యూ పేరుతో చూపిస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

ఉపముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు


పవన్‌కల్యాణ్‌తో జయకృష్ణ

పాలకొండ, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కలిశారు. పాలకొండ నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. తోటపల్లి, జంపరకోట ప్రాజెక్టుల పరిధిలో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. నాలుగు మండలాల్లోని పలు గ్రామాల్లో రహదారులు, ఇంటింటికీ కుళాయిలు వేయాల్సి ఉందన్నారు.

పేద కుటుంబానికి ఆసరా

పార్వతీపురం గ్రామీణం: మండలంలోని కొత్తఊరుకు చెందిన గోపాలరావు జంఝావతిలో వేటకు వెళ్లి మృతి చెందారు. ఆయన భార్య మూడు నెలల గర్భిణి. ఇప్పటికే ఒక పాప ఉంది. ఈ నేపథ్యంలో పేద కుటుంబానికి పలువురు అండగా నిలిచారు. గ్రామస్థులు, స్నేహితులు సేకరించిన రూ.22 వేలును సోమవారం కుటుంబ సభ్యులకు బెవరరాజు తదితరులు అందజేశారు.

గోపాలపురంలో గస్తీ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపురంలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు గస్తీ కాస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో కొన్ని రోజులు గస్తీ నిర్వహిస్తామని గ్రామీణ ఎస్సై బి.సంతోషికుమారి తెలియజేశారు.

ఓటరు ధ్రువపత్రాల అందజేత

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా ఫారం-19ను ధ్రువపత్రాలను తహసీల్దారు ఆర్.పకీరుకు ఏపీటీఎఫ్ నాయకులు అందజేశారు. నమోదు గడువు నవంబరు 6లోపు అర్హులైన ఉపాధ్యాయులకు అందించాలని సంఘ నేతలు కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు జి.దాలినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ, వై.శంకరరావు, డి.వేణుగోపాలరావు, రంగయ్య, కె.శ్రీను తదితరులున్నారు.

సాగునీరు కోరుతూ నిరసన

పాలకొండ, న్యూస్‌టుడే: తోటపల్లి పాత ఆయకట్టు శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని సిటు జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు కోరారు. పాలకొండ జల వనరుల శాఖ డీఈ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నినాదాలు చేశారు. దిగువ ప్రాంతాలకు నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయన్నారు. ఏఈలు శంకరరావు, కార్తిక్‌కు వినతిపత్రం అందించారు.

అందరిలోనూ ఉత్కంఠ

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో 14 కేజీబీవీల్లో 33 బోధన, బోధనేతర పోస్టులు ఉండగా 709 మంది దరఖాస్తు చేశారు. ఇటీవల వారికి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. బోధన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఇచ్చేందుకు డీఈవో పగడాలమ్మ, అధికారులు జాబితా తయారు చేస్తున్నారు. సోమవారం జాబితా ఇస్తామని విద్యాశాఖ ప్రకటించినా రాత్రికి కూడా కొలిక్కి రాలేదు.

బోధనేతర పోస్టులతో తంటా..

బోధనేతర పోస్టులకు విద్యార్హతలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఎంపిక ఎలా చేయాలని తంటాలు పడుతున్నారు. ఈ పోస్టులకు రాజకీయ పైరవీలు తప్పడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులపై అభ్యర్థులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఇన్నాళ్లు మిమ్మల్నే నమ్ముకున్నాం.. అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. పైరవీలకు అవకాశం లేకుండా స్థానికతను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రతిభా వంతుల జాబితా వేళాడదీస్తామని డీఈవో పగడాలమ్మ తెలిపారు.


దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు

పెదపెంకిలో సమస్యలపై ఆరా

బలిజిపేట, గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో సమస్యలపై వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ ఆరా తీశారు. 'పెదపెంకిలోని ప్రతి వీధిలో సమస్యలే' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనంపై స్పందించారు. ప్రధాన వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. బోద బాధితులతో మాట్లాడారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: వసతి గృహంలో ఉండే గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని ఐటీడీఏ డీడీఎంహెచ్‌వో పద్మావతి ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురంని గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని ఆమె సోమవారం సందర్శించారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతున్న పి.పవన్‌కుమార్, కె.పవన్‌కుమార్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 23న నెల్లూరులో పోటీలు జరగనున్నట్లు చెప్పారు. ❖ పాచిపెంట: పాచిపెంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.చైతన్య 400, 800మీ పరుగులో ప్రథమ, ఎం.శరణ్య 3 కి.మీ రేస్‌వాక్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎఉ.కావ్య, ఎం.కుసుమ, పి.ఇందు, వి.లోహిత అండర్-17 క్రికెట్ జట్టులో స్థానం సాధించారని హెచ్‌ఎం ఈశ్వరరావు, పీడీ చిన్నారావు తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాగేశ్వరరావు


ఎంపికైన బాలికలతో ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు, పీడీ చిన్నారావు

పంటలకు నష్టం

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలలతో పంటలు నేలమట్టమయ్యాయి. నారాయణపురంలో సుమారు 70 ఎకరాలు, గౌరీపురం, పెద్దింపేటలో 30 ఎకరాల మేర పంటలు పాడైనట్లు సీపీఎం నాయకుడు సత్యనారాయణ తెలిపారు. అధికారులతో కలిసి పొలాలను పరిశీలించారు.


గౌరీపురంలో పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులకు ఆనందం

పార్వతీపురంలోని అన్నక్యాంటన్‌కు విద్యార్థులు వరుస కడుతున్నారు. కళాశాలకు వచ్చేవారు గతంలో క్యారేజీలు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం క్యాంటీన్ సేవలు అందుబాటులోకి రావడంతో చాలా మంది రూ.5 చెల్లించి భోజనాలు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం క్యాంటీన్ విద్యార్థులతో కళకళలాడుతూ కనిపించింది. –న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం



వినికిడి పరికరాల పంపిణీ

కలెక్టరేట్ ప్రాంగణం: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జేసీ శోభిక అన్నారు. పార్వతీపురం, పాలకొండ మండలాలకు చెందిన వి.ప్రసాదరావు, నందీశ్వరరావు, రమణమ్మకు వినికిడి పరికరాలు ఇచ్చారు.

బాధ్యతల స్వీకరణ

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస ఎంఈవో-1గా డి.గౌరునాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. ఈయన ప్రస్తుతం వీరఘట్టం ఎంఈవోగా పూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

విద్యార్థులకు పోషకాహారం తప్పనిసరి


వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి సౌమ్యజోస్ఫిన్

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి జె.సౌమ్య జోస్ఫిన్ ఆదేశించారు. సోమవారం కురుపాం, శివ్వన్నపేటలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. నిల్వ ఉన్న సరకులు, వంట గదులు, భోజనాలు పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలని సూచించారు.

ఐటీడీఏకు 87 వినతులు


సమస్యలు తెలుసుకుంటున్న డీడీ అన్నాదొర, పీహెచ్‌వో గణేష్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన ప్రజా పరిష్కార వేదికకు 87 అర్జీలు వచ్చినట్లు డీడీ ఎం.అన్నాదొర, పీహెచ్‌వో ఎస్.వి.గణేష్ తెలిపారు. గర్భిణుల వసతి గృహంలో ఏఎన్‌ఎంలకు రాత్రి, పగలు డ్యూటీలు వేయొద్దని పలువురు కోరారు. ఇక్కడ వైద్యులను నియమించాల్సి ఉందన్నారు. డీడీఈవో పి.నారాయుడు, ఏఎంవో పి.కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 85 మంది ఎంపిక

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: యువత నైపుణ్యం పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. సోమవారం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాలో ఆయన పాల్గొని అభ్యర్థులకు సూచనలు చేశారు. మొత్తం 19 కంపెనీలు హాజరవగా 578 మంది అభ్యర్థులు వచ్చారు. వీరిలో 85 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.చలపతిరావు, జిల్లా నైపుణ్యాధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు.


ధ్రువపత్రాలు చూపుతున్న అభ్యర్థులు